# పచ్చిరొట్ట కోసం పాట్లు

- జనుము, జీలుగ విత్తనాల కోసం రైతుల తిప్పలు
- మల్యాల, గొల్లపల్లి మండలాల్లో అవస్థలు
- క్యూలైన్లలో పాస్‌బుక్ పత్రాల జిరాక్స్‌లు
- కొన్నిచోట్ల ఒక్కటే బస్తా.. మరికొన్ని చోట్ల రెండు బస్తాలు
- కొన్నిచోట్ల అవి కూడా దొరక్క వెనుదిరిగిన పలువురు రైతులు

**ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలు మళ్లీ కనిపిస్తున్నాయి. క్యూలైన్లలో పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలు పెట్టి నిరీక్షించాల్సిన పరిస్థితులు వచ్చాయి. పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు మళ్లీ అవస్థలు పడుతున్నారు. ఒక్క పట్టాదార్ పాసుబుక్కుకు ఒక్కటి, కొన్ని చోట్ల రెండు బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో అవి ఏ మూలకు సరిపోతాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

- మల్యాల/ గొల్లపల్లి, మే 27


మల్యాలలో పచ్చిరొట్ట విత్తనాల కోసం క్యూలో పెట్టిన పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు

### మల్యాలలో క్యూ

మల్యాలతోపాటు మండలంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్ పాయింట్లు, ఆగ్రోస్ కేంద్రాల వద్ద ప్రభుత్వపరంగా రాయితీపై అందజేసే పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ బస్తాలు సోమవారం పంపిణీ చేయడంతో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రధానంగా మల్యాల పీఏసీఎస్ వద్ద రైతుల పాసుపుస్తకాల జిరాక్స్ ప్రతులను క్యూలో పెట్టారు. మల్యాల, నూకపల్లి, పోతారం సహకార సంఘాట వద్ద రైతులకు ఎరువుల బస్తాలు దొరక్క నిరాశగా తిరిగి వెళ్లారు. ఈ విషయమై మల్యాల ఏవో చంద్రదీపక్‌ను సంప్రదించగా.. మండలానికి అవసరమయ్యే జీలుగ, జనుము బస్తాల కోసం పెట్టిన ఇండెంట్‌లో కేవలం 50 శాతం మాత్రమే వచ్చాయని, మిగతా 50 శాతం బస్తాలు మరో మూడురోజుల్లో వస్తాయని, రాగానే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

### గొల్లపల్లిలో ఒక్కటే బస్తా

గొల్లపల్లి మండల కేంద్రంలోని డీసీఎంఎస్, ఏఆర్‌ఎస్‌కే కేంద్రాల ద్వారా సబ్సిడీపై జీలుగ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయగా, ఒక్కో కేంద్రానికి 834 (ఒక్కొక్కటి 30 కిలోలు) బస్తాలు మాత్రమే కేటాయించడంతో వాటి కోసం రైతులు ఎగబడ్డారు. మండలంలో 27 గ్రామాలుండగా పదివేల పైచిలుకు రైతులున్నారు. పట్టా పాస్‌బుక్‌కు ఒక్క బస్తానే ఇవ్వడంతో అవి సరిపోవని నిర్వాహకుడితో రైతులు వాదనకు దిగారు. ఐదెకరాలకు పైఅ ఉన్న వారికి ఒక్క బస్తా ఏమూలకు సరిపోతుందని మండిపడ్డారు. ఒక్క బస్తా కోసం ఒక్క రోజంతా కేంద్రాల వద్ద పడికాపులు కాయాల్సి వచ్చిందన్నారు. డీసీఎంఎస్ నిర్వాహకుడు రైతుల పాస్ బుక్‌ల జిరాక్స్ తీసుకుని పేర్లు పిలుస్తూ రైతుకు ఒక బస్తా చొప్పున అందించారు. మొదటి విడతగా వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలు 20 శాతం మంది రైతులకు కూడా సరిపోకపోవడంతో మిగిలిన వారు నిరాశగా వెనుదిరిగారు.



గొల్లపల్లి డీసీఎంఎస్ కేంద్రం వద్ద జీలుగ విత్తనాల కోసం నిరీక్షిస్తున్న రైతులు

### మళ్లీ ఎప్పుడు వస్తయో తెల్వదు

వానకాలం పంట సీజన్‌లో ఎరువుల వాడకం తగ్గించేందుకు ఏటా జీలుగ చల్లుతం. ఏపుగా పెంచి, రొటవేటర్, కేజీవీల్స్ సాయంతో పొలం దున్నుకుని సారవంతం చేసుకుంటం. కానీ, పోతారం సహకార సంఘ పరిధిలో నాలుగు గ్రామాలు ఉంటే ప్రభుత్వం సబ్సిడీపై 100 మాత్రమే జీలుగ బస్తాలు పంపిణీ చేసింది. నాకు విత్తనాలు దొరుకలేదు. మళ్లీ వస్తాయని చెప్పిన్రు. మళ్లీ ఎప్పుడు వస్తయో తెల్వదు. గతంతో పోలిస్తే జీలుగ బస్తా ధర పెరిగింది. కొందరు జీలుగ చల్లుకుని సాగు చేసుకుంటే మేమోమో విత్తనాల కోసం ఎదురుచూసుడు అయితంది.

**-గొట్టం నారాయణ, రైతు, రాంపూర్(మల్యాల)**

### జనుము బస్తాలు ఇస్తలేరు

సోమవారం నూకపల్లి సహకార సంఘ పరిధిలో కేవలం జీలుగ బస్తాలు మాత్రమే ఇచ్చిన్రు. మట్టి భూమికి జీలుగ, చెలుక పొలానికి జనుము విత్తనాల అలుకడం వల్ల భూములు సారవంతమవుతయి. ప్రభుత్వపరంగా జీలుగ బస్తాలు మాత్రమే ఇస్తున్నరు. జనుము బస్తాలు ఇస్తలేరు. వస్తాయంటున్నరు కానీ, ఎప్పుడు వస్తయో తెల్వదు. జీలుగ బస్తాల కోసం కొందరు రైతులు లైన్‌లో నిలబడినా దొరకకపోవడంతో వెనుదిరిగిన్రు. ఇప్పటికైనా రైతులకు సరిపడా జనుము, జీలుగ బస్తాలు అందించాలి. రోహిణీ కార్తెలోనే చల్లుకునేలా అధికారులు చొరవ చూపాలి.

**- కేతిరెడ్డి తిరుపతిరెడ్డి, రైతు, రామన్నపేట (మల్యాల)**

# వాహనదారుల జేబులకు చిల్లు

**కరీంనగర్ జిల్లాలో ఎక్కడా లేని నిబంధనలు!**

- ట్రాక్టర్లు, ఆటోల రిజిస్ట్రేషన్లకు తిప్పలు
- భయపెట్టి.. ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు
- రవాణా శాఖ అధికారులపై విమర్శలు
- ఆ శాఖమంత్రి సొంత జిల్లాలో బాగోతం




**కరీంనగర్ రవాణా శాఖ అధికారుల పనితీరు చర్చనీయాంశమవుతున్నది. మిగతా జిల్లాల్లో లేని విధంగా వాహనదారుల జేబులకు చిల్లు పెడుతున్నట్టు తెలుస్తున్నది. మెట్రో నగరాల్లో అమలు చేయాల్సిన నిబంధనలను చూపి.. తమ జేబులు నింపుకునేందుకు ప్రైవేట్ ఉద్యోగులను నియమించి మరి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సొంత జిల్లాలోనే ఈ వ్యవహారం నడుస్తున్నట్టు విమర్శలు వస్తుండగా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్ రాంనగర్, మే 27 : వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో రైతులు ట్రాక్టర్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. తమ పనితోపాటు చుట్టుపక్కల వారి పనులు చేస్తే ఉపాధి దొరుకుతుందని వీటి కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. రోజురోజుకూ కొనుగోళ్లు పెరగడం గమనించిన అధికారులు అక్రమాలకు తెరలేపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొనుగోలు చేసిన ట్రాక్టర్లను రిజిస్ట్రేషన్‌కు తీసుకొస్తే ప్రొసీడింగ్ లేనిదే రిజిస్ట్రేషన్ చేయరాదని, భూమి ఉంటేనే వ్యవసాయ పనులకు ట్రాక్టర్ కొనుగోలు చేయాలని కొర్రీలు పెడుతున్నారు. అసలు రైతులు ట్రాక్టర్ కొనే సమయంలోనే వాహన షోరూంలో తమ భూమి పత్రాలు చూపిస్తారు. వాణిజ్య అవసరాలకు కొనే వారికి ఈ నిబంధన ఉండదు. వాటికి త్రైమాసిక పన్ను విధానం ఉంటుంది. అయితే, అధికారులు మాత్రం రిజిస్ట్రేషన్ కోసం వస్తున్న ట్రాక్టర్లకు పాస్‌బుక్‌లు చూపాలని, ప్రొసీడింగ్ తీసుకోకుండా ఎలా కొనుగోలు చేశారంటూ రిజిస్ట్రేషన్ చేయలేమని చెబుతున్నారు. రూ.లక్షలు పోసి, అప్పులు చేసి, ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొన్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులను బతిమిలాడితే.. తమ ప్రైవేట్ ఉద్యోగులకు అప్పగించి నిబంధనలకు విరుద్ధంగా 'మీ కోసం చేస్తున్నా'మంటూ అందిన కాడికి దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

### ఆటో యజమానులదీ అదే పరిస్థితి

ఇప్పటికే ఆటోలు నడవక ఆటోవాలాలు బలవన్మరణానికి పాల్పడుతుంటే రవాణాశాఖ అధికారులు కొత్తగా ఆటోలు కొనే వారికి చుక్కలు చూపిస్తున్నారు. మెట్రో నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆటోల కొనుగోలుపై ఆంక్షలున్నాయి. అక్కడ కొనాలనుకుంటే ముందుగా అధికారుల అనుమతి తీసుకోవాలి. ఆ ప్రొసీడింగ్స్ ద్వారా కొనుగోలు చేయాలి. కానీ, కరీంనగర్ జిల్లాలోనూ ఆటోలు రిజిస్ట్రేషన్‌కి వస్తే ప్రొసీడింగ్ లేకుండా ఎలా కొంటావని అధికారులు బెదిరిస్తున్నట్టు తెలుస్తున్నది. రిజిస్ట్రేషన్ చేయలేమని ప్రొసీడింగ్ లేకుండా కొనుగోలు చేయడం నిబంధనలకు విరుద్ధమంటూ ఆటోవాలాలను భయపెట్టి.. రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తూ అందిన కాడికి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా రవాణా శాఖ అధికారుల అవినీతి దాహానికి రైతులు, ఆటోవాలాలు తమ జేబులు గుళ్లవుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగతా జిల్లాల్లో లేని నిబంధనలు రాష్ట్ర రవాణా మంత్రి సొంత జిల్లాలో అమలు చేయడంపై అధికారుల అవినీతి కారణమని తెలుస్తున్నది. ఇకనైనా దీనిపై దృష్టి సారించి లేని నిబంధనలు అమలు చేస్తున్న అధికారులపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరమున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### గ్రేటర్ నిబంధనలు అమలు చేస్తున్నాం : డీటీసీ పురుషోత్తం

వాహనాల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా గ్రేటర్ కార్పొరేషన్‌లో అమలు చేయాల్సిన నిబంధనలు పాటిస్తున్నామని కరీంనగర్ డీటీసీ పురుషోత్తం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో రవాణాశాఖ డివిజన్లు రెండే ఉండగా హుజూరాబాద్ మినహా కరీంనగర్ కార్పొరేషన్ గ్రేటర్ కార్పొరేషన్‌గా భావించి అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులు కొనుగోలు చేసే ట్రాక్టర్లకు తప్పనిసరిగా పాసుబుక్కులు చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ గ్రేటర్ పరిధిలో లేదని అడిగిన ప్రశ్నకు వివరణ ఇస్తూ.. దీనిపై కలెక్టర్‌తో మాట్లాడాల్సి ఉందని సమాధానం చెప్పారు.

# 'భారీ భూ బాగోతం'పై కదలిక

- సంచలనం సృష్టించిన 'నమస్తే కథనం'
- కలెక్టర్ యాస్మిన్ బాషా ఆరా
- నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశం
- ఇరువర్గాలకు నోటీసులు


జగిత్యాల మున్సిపాలిటీలో
భారీ భూ బాగోతం!
కోట్ల రూపాయల విలువైన భూమి కాజేసేందుకు ప్రయత్నం

సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం

జగిత్యాల అర్బన్, మే 27 : పదమూడేళ్ల క్రితం జీపీ పరిధిలో పాసుపుస్తకం ద్వారా కొన్న 12 గుంటల స్థలానికి, మున్సిపల్‌లో ఆస్తిపన్నుకు సంబంధించిన నకిలీ పత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా ఒకేసారి 12 ఏండ్ల వీఎల్‌టీ టాక్స్ చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పన్నిన కుట్ర జగిత్యాల మున్సిపల్‌లో బయటపడింది. దీనిని పరిశీలిస్తే అనేక లోపాలు, అవకతవకలు జరిగినట్టు వెలుగులోకి వస్తున్నది. ఈ అవినీతి వెనుక ఓ ఉద్యోగితోపాటు మరికొందరు ఉన్నట్టుగా ఆరోపణలు వ్యక్తం కాగా, దీనిపై 'జగిత్యాల మున్సిపాలిటీలో భారీ భూ బాగోతం' శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ' వచ్చిన కథనం సంచలనం సృష్టించింది. కలెక్టర్ యాస్మిన్ బాషా సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై ఆరా తీశారు. పూర్తి విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇరు వర్గాల వారికి నోటీసులు జారీ చేసి.. వారి దస్త్రాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ మేరకు మున్సిపల్ కమిషనర్ ఇరు వర్గాల వారికి నోటీసులు జారీ చేశారు. మూడురోజుల్లో వారి వద్ద ఉన్న పూర్తి డాక్యుమెంట్లు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని సూచించారు. విచారణ చేపట్టి డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్న వారికి న్యాయం చేస్తానన్నారు. ఫేక్ డాక్యుమెంట్లు ఇచ్చిన వారి వీఎల్‌టీని రద్దు చేయడంతోపాటు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కూడా స్పందించి.. ఇరు వర్గాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, మున్సిపల్ కార్యాలయంలో సమర్పించిన అసెస్‌మెంట్ పత్రాలను పరిశీలించాలని ఆదేశించారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

- నిజామాబాద్‌లో ఖాళీ బిందెలతో ఆందోళన


కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని 8వ వార్డులో ఖాళీ బిందెలతో అందోళన చేస్తున్న మహిళలు

కోనరావుపేట, మే 27 : తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని 8వ వార్డులో మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం గ్రామంలో అందోళనకు దిగారు. వారం రోజుల నుంచి నల్లా నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్తే ఒక్క రోజు మాత్రమే వాటర్ ట్యాంకర్ ద్వారా నీరందించినట్లు తెలిపారు. ఈ విషయమై కార్యదర్శిని సంప్రదించగా, సాయంత్రం వేళలో వాటర్ ట్యాంకర్‌తో తాగునీటిని అందించినట్లు పేర్కొన్నారు.

# రాజన్న భక్తులకు కరెంట్ కష్టాలు

- ఐదు రోజులుగా పనిచేయని జనరేటర్
- పవర్ కట్ అయినప్పడల్లా వసతి గదుల్లో పని చేయని ఏసీలు, ఫ్యాన్లు
- కోడెల క్యూ కాంప్లెక్స్‌లోనూ అదే పరిస్థితి
- వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న భక్తులు

**వేసవి సెలవులు కావడంతో రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. దర్శనం సంగతేమో గానీ, సౌకర్యాలు లేక నరకం చూస్తున్నారు. ఐదు రోజులుగా జనరేటర్ పనిచేయక పవర్ కట్ అయినప్పుడల్లా ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వసతి గదుల్లో ఏసీలు, ఫ్యాన్లు పనిచేయక, కోడెమొక్కుల క్యూ లైన్ కాంప్లెక్స్‌లోనూ ఫ్యాన్లు తిరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనరేటర్ పనిచేయదని తెలిసినప్పుడు తాత్కాలిక ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని మండిపడుతున్నారు.**


రిపేర్‌లో ఉన్న ఆలయ 250కేవీఏ జనరేటర్

వేములవాడ, మే 27: వేసవి సెలవుల సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ప్రతిరోజూ వేలాది మంది తరలిరావడం కనిపిస్తున్నది. ఎండకాలం కావడంతో భక్తులు ఏసీ వసతి గదులకే ప్రాధాన్యతనిస్తూ భీమేశ్వర సదన్ ఏసీ గదుల్లో విడిది చేస్తున్నారు. అయితే జనరేటర్ పనిచేయక విద్యుత్ కట్ చేసినప్పుడల్లా ఇబ్బంది పడుతున్నారు. రాజన్న ఆలయానికి మూడు జనరేటర్లు ఉన్నాయి. అందులో ఒకటి 250 కేవీఏ, మరో రెండు 125కేవీఏ జనరేటర్లు ఉన్నాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు 250 కేవీఏ, 125కేవీఏతో ప్రధానాలయం, అనుబంధ ఆలయాలు, పరిపాలన కార్యాలయం, భీమేశ్వర సదన్ (ఏసీ), పార్వతీపురం వసతి గదులు, పంపు మోటర్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. నందీశ్వర, లక్ష్మి గణపతి వసతి గదుల సముదాయంతోపాటు విచారణ కార్యాలయం కోసం మరో 125కేవీఏ అందుబాటులో ఉన్నది. ప్రస్తుతం 250 కేవీఏ జనరేటర్ ఐదు రోజులుగా పనిచేయడం లేదు. దానిని రిపేర్ చేయాలని టెక్నికల్ సిబ్బందికి అధికారులు సూచించారు. ఇది అందుబాటులోకి రావడానికి మరో మూడు రోజుల పట్టే అవకాశముందని చెబుతున్నారు. అయితే ఆకస్మికంగా విద్యుత్ కట్ అవుతున్న తరుణంలో భీమేశ్వర సదన్ (ఏసీ), పార్వతీపురం వసతి గదుల సముదాయాలకు విద్యుత్‌ను అందించలేకపోతున్నారు. ఆదివారం రెండున్నర గంటలపాటు కరెంట్ నిలిచిపోగా.. భక్తులు ఉక్కపోతతో ఆగమయ్యారు. ఎండ వేడి ఉందని ఏసీ గదులు తీసుకున్నా ఏం ప్రయోజనముందని వాపోతున్నారు. జనరేటర్ రిపేర్‌లో ఉన్నప్పుడు తాత్కాలిక ఏర్పాట్లు ఎందుకు చేయలేదని మండిపడుతున్నారు.


కోడెల క్యూ ఓపెన్ స్లాబ్‌లో తిరగని ఫ్యాన్

### కోడెల క్యూ కాంప్లెక్స్‌లో తిరగని ఫ్యాన్లు

సాక్షాత్తు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవలే భక్తుల వసతి సదుపాయాలపై సమీక్ష నిర్వహించినా అధికారులు తీరు మాత్రం మారడం లేదు. అసలే ఎండకాలం, పైగా భక్తుల రద్దీ.. ఈ సమయంలో వేడితో ఇబ్బంది పడుతున్నా కనీస ఏర్పాట్లను చేయడం లేదు. ఏడాదికి ₹20కోట్లకు పైగా ఆదాయం తెచ్చిపెట్టే భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. కోడె మొక్కుల కోసం దర్శించుకునే భక్తులు రాజేశ్వరపురం కట్ట మీదుగా ఉన్న క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయ ఓపెన్ స్లాబ్ కాంప్లెక్స్‌లో టికెట్‌ను తీసుకొని నేరుగా రాజ న్న ఆలయంలోకి వెళ్తారు. ఆది, సోమవారాల్లో భక్తులు 5నుంచి 6 గంటల సమయం పడుతున్నదని, కనీసం ఫ్యాన్లు కూడా తిరగడం లేదని భక్తులు వాపోతునవారు. వేడి, ఉక్కపోతతో పిల్లలు సైతం ఇబ్బంది పడుతున్నార ని మండిపడుతున్నారు. తిరగని ఫ్యాన్లు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

### జనరేటర్ రిపేర్‌లో ఉన్నది



జనరేటర్ ఐదు రోజులుగా రిపేర్ లో ఉంది. వసతి గదులు మినహా ప్రధాన ఆలయానికి, అనుబంధ ఆలయానికి అదనపు జనరేటర్ ద్వారా అత్యవసర పరిస్థితులలో విద్యుత్‌ను అందిస్తున్నాం. భీమేశ్వర సదన్, పార్వతీపురం గదులకు మాత్రం ఇవ్వడం సాధ్యం కావడం లేదు. రెండు మూడు రోజుల్లో జనరేటర్ రిపేర్‌ను పూర్తి చేసి అందుబాటులో తీసుకువస్తాం.

**-రాజేశ్, ఈఈ (రాజన్న ఆలయం)**

### ఫ్యాన్లు తిరుగుత లేవు



రాజన్న కోడె మొక్కు చెల్లించుకునేందుకు క్యూలో నిల్చుంటే ఐదు గంటల సమయం పట్టింది. పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ పూర్తిగా అధ్వానంగా ఉన్నది. కనీసం ఫ్యాన్లు కూడా తిరగడం లేదు. ఉక్కపోతతో మస్తు ఇబ్బంది పడ్డం. చిన్నపిల్లలు ఐదు గంటలు నరకం చూసిన్రు.

**- సంతోష్ రెడ్డి, చందలాపూర్ (సిద్దిపేట జిల్లా)**

# ధాన్యం రైతు గోస

- కొనుగోళ్లలో నిర్లక్ష్యం.. మొలకెత్తుతున్న ధాన్యం
- కేంద్రాల్లో పేరుకుపోతున్న రాశులు
- రోజులు గడుస్తున్నా కేంద్రాల్లోనే మాగుతున్న వడ్లు
- ఆందోళనలో రుద్రంగి మండల రైతులు


రుద్రంగిలో నెల రోజులుగా పేరుకుపోయిన ధాన్యం కుప్పలు


మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు గంగు

రుద్రంగి, మే 27: రైతాంగం అరిగోస పడుతున్నది. ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యంతో కన్నీరు పెడుతున్నది. మొన్నటిదాకా సాగునీరు లేక, కరెంట్ సరిగ్గా ఉండక అరిగోస పడి, పండించిన కొద్దిపాటి ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తే.. సకాలంలో కొనేవారు లేక ఆగమవుతున్నది. సెంటర్లకు వడ్లు తెచ్చి పదిహేను ఇరువై రోజులైనా కొనకపోవడం, రోజురోజుకు రాశులు పేరుకుపోవడం, మరోవైపు గన్నీ సంచులు, లారీల కొరతతో కొన్నది వెనువెంటనే మిల్లులకు తరలించకపోవడంతో అటు ధాన్యాన్ని, ఇటు బస్తాలను కాపుకాయలేక, అకాల వర్షానికి కాపాడుకోలేక ఆందోళన చెందుతున్నది. అక్కడక్కడ కండ్ల ముందే తడిసిపోయి మొలకెత్తుతుండడంతో ఆవేదన చెందుతున్నది. ఇందుకు రుద్రంగి మండలమే నిదర్శనంగా నిలుస్తున్నది. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నది. తేమశాతం వచ్చినా నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం పేరుకుపోతున్నది. దీంతో రేయింబవళ్లు ధాన్యం వద్దే ఉంటూ, వర్షానికి తడవకుండా టార్పాలిన్లతో కాపుకాస్తున్నారు. రోజులు గడుస్తున్నా కొనకపోవడం, అకాల ముప్పుతో ధాన్యం తడిసిపోతుండడంతో కొందరు రైతులు తక్కువ డబ్బులకు దళారులకు విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వం తమను ఇంత గోస పెట్టవద్దని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వడ్లు తెచ్చి రెండు నెలలైతంది



నేను రుద్రంగి సెంటర్‌కు వడ్లు తెచ్చి రెండు నెలలైతంది. మాయిచ్చర్ రాలేదంటే చాలా రోజులు ఆరబెట్టిన. మాయిచ్చర్ వచ్చిన తర్వాత నిర్వాహకుల దగ్గరికిపోతే రేపు, మాపంటూ దాటేస్తున్నరు. రోజంతా ఇక్కడే ఉండి కాపుకాస్తున్నం. కానీ ఏం లాభం? మొన్నపడ్డ వానలకు ధాన్యం తడిసి మొలకలచ్చినయి. ప్రభుత్వం మా రైతుల ఇంత గోసపెట్టద్దు. మొలకెత్తిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయాలి.

**- లింగంపెల్లి లక్ష్మి, రుద్రంగి**

### గోస పెట్టుడు న్యాయం కాదు

మాది రుద్రంగి. నేను చాలా ఏండ్ల సంది ఎవుసం చేస్తున్న. ఈ యేడు సాగు నీళ్లు రాక రెండు లోడ్ల ధాన్యం మాత్రమే దిగుబడి అచ్చింది. పండిన కొద్దిపాటి ధాన్యాన్ని కేంద్రానికి తెస్తే రుద్రంగిల సెంటర్‌కు తేస్తే నెల రోజులైనా కొనలే. సార్లు రేపు మాపంటూ దాటేస్తున్నరు. అప్పటి నుంచి ఇక్కనే వడ్ల కావలి ఉంటున్నం. మొన్న పడ్డ వానకు వడ్లు తడిసి మొలకలు అచ్చినయి. ఇసోంటి పరిస్థితి గతంలో ఎన్నడూ రాలె. మమ్ముల ఇట్ల గోస పెట్టుడు అధికారులకు న్యాయం కాదు. ఈ పాపం వాళ్లదే. తడిసిన, మొలకెత్తిన ధాన్యం మొత్తం సర్కారే కొనాలి.

**- సింగారపు గంగు, రుద్రంగి**

# ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం

- కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



కరీంనగర్ కలెక్టరేట్, మే 27 : ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమైందని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి స్పష్టం చేశారు. జూన్ 4న నిర్వహించే లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్‌పై కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తేనే ఓట్ల లెక్కింపు పూర్తి చేయవచ్చన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఉదయం 7 గంటలకే లెక్కింపు హాళ్లలోకి చేరుకోవాలని, ఎలాంటి సమస్యలు వచ్చినా అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఈవీఎంలు సక్రమంగా ఉన్నా యో లేదో చూడాలని, లెక్కింపు ఏజెంట్లతో సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు హాలు నుంచి ఎవరూ బయటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు అనుమతించబోరని, నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. ఈడీసీ, పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్ల లెక్కింపు పకడ్బందీగా చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రతి టేబుల్ వద్ద ఓట్ల లెక్కింపు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. అనంతరం ఓట్ల లెక్కింపుపై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో లోక్‌సభ ఏఆర్‌వో కే మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571